


# వేకువ ప్రశ్న

జి. వెంకట కృష్ణ

**గోర్కి 'అమ్మ' పుస్తకం చేత పట్టుకొని స్టేషన్లోకొచ్చిందామె. నాలుగో నంబర్ ప్లాట్ ఫారం మీద పల్చగా తిరుగుతున్న జనం మధ్య నిండుగా తల మీదుగా శాలువాతో, గుండెల మీద పుస్తకంతో, భుజానికి ట్రావెలింగ్ బ్యాగుతో ప్రయాణికురాలి వేషంలో వెళ్లాల్సిన స్థలం వైపు నడుస్తోంది. తనని పలకరించే మనిషి కోసం కళ్లలోకి శక్తినంతా తెచ్చుకొని వెతుకుతున్నది. ఆ చలిరాత్రి ప్లాట్‌ఫారాల మీది సందడీ, కలగా పులగపు ధ్వనులు, టీవీ అడ్వర్టయిజ్‌మెంట్లూ, తోపుడు బల్లల టీ అరుపులూ మధ్యా అంతరంగంలో హోరుమంటున్న నీటి సుడులలో ''అమ్మా'' అన్న పిలుపును భ్రమిస్తూ గాలి అలల మీద తేలిపోతున్నట్లు అనుభూతికి లోనవుతున్నది. మధ్యాహ్నం నుండీ ఒక్కో క్షణం ఒక్కో దివ్యానుభూతిలా, ఒక దుర్ఘటనలా, దిగమింగలేని దుఃఖంలా, ఉత్తేజాన్నిస్తున్న వేకువలా గడుపుతోంది.**

ఆమె ఎదురు చూస్తున్న మనిషి ఆమె దృష్టిలో, అనన్య సామాన్యమైన త్యాగాలనూ, అసాధ్యమైన దుస్సాహసాలనూ చేస్తున్న వాడు. అతను ఆమె తన కొడుకుకు ఎంత పరిచయమో, కూడా తెలీదు. ఇదిమిద్ధంగా ఇలాగే ఉంటాడనీ తెలీదు. ఈ రాత్రి కలుస్తాడనీ, వివరంగా మాట్లాడగలనన్న నమ్మకమూ లేదు. ఈ నిరీక్షణ ఎంత సేపో! వేకువ దాకానా? వేకువ ఎప్పుడు?!

ఆ మధ్యాహ్నం....

***

''అమ్మా కొరియర్'' అన్న పిలుపుతో, తలుపు తెరుచుకొని గేటు దగ్గరికొచ్చింది శాంతమ్మ.

ఆ రోజు రెండవ శనివారమవడంతో ఆఫీసుకు వెళ్లే పని తప్పి ఇంటి వద్దనే ఉందామె.

గేటు ముందు నిల్చుని ఒకబ్బాయి, నెత్తి మీద క్యాప్, భుజానికి బ్యాగ్, గేటు తెరిచే ప్రయత్నం చేస్తున్నాడు. తన చేతిలో పార్శిల్. రెండంగల్లో గేటును చేరుకొని, దాన్నందుకొని శాంతమ్మ యధాలాపంగా కవర్‌ను చూసింది. తన పేరు ఉన్న కవర్. అలాంటి కవర్లు ఆమెకు సుపరిచితమే. వెనుక వైపు మూలలో ''పి'' అక్షరం సున్నా చుట్టుండేవి. అంతే ఒక్క క్షణం ఆగి, ఆత్రంగా వెనక్కి తిరిగింది. కవర్ అందించిన అబ్బాయి వెనుదిరుగుతున్నాడు.

''బాబూ'' చాలా మంద్రంగా, ఆర్తిగా,ఉద్విగ్నంగా, గుండెల్లోంచి పెకిలించుకొని అంది.

ఆ పిలుపును ఊహించిన వాడిలా అతను,

''అమ్మా ఇప్పుడు మాట్లాడ్డం కాదు, రాత్రికి రైల్వే స్టేషన్లో కలవాలనుంటే కలవండి. ఎలా అన్నది ఉత్తరంలో ఉంది చూడండి'' గబగబా అని అంతే వేగంగా ఇంటికి మూలగా ఉన్న చింత చెట్టు వైపుకు వెళ్లి, అక్కడ నిల్చున్న మరొక మనిషితో పాటు వెళ్లిపోతున్నాడు.

శాంతమ్మకు అర్థమైపోయింది. ఆ పార్శిల్, దాన్ని తెచ్చిచ్చిన మనిషీ, చెట్టు కింద నిల్చున్న మనిషి ఎవరనే విచికిత్సలో 'వాడు కాదు గదా, ఇంటిలోకి రాకుండా పోతాడా, వాడు కాదు...' అనుకుంటూ గేటు తెరుచుకొని గబగబా చెట్టు కిందికి పోయింది. వాళ్లిద్దరూ అప్పటికే వీధి

మలుపు తిరుగుతూ...

కవర్ ఇచ్చిన అబ్బాయి పక్కనున్న మనిషిలో శాంతమ్మ ఏవో పోలికలు వెదికింది. వెనక నుండీ ఆ ఒడ్డూ,పొడవూ, కాలంతో వచ్చే మార్పుల్ని ఊహించుకుంటూ ఆత్రంగా కళ్ళద్దాలను మరిచి పోయినా, మసక చూపును బలవంతంగా కేంద్రీ కరిస్తూ. అయితే ఆమె అంచనాలేవీ సరిపోల్చుకో లేకపోయాయి. అంతలో అటుగా వెళుతున్న ఆటోను ఆపి వాళ్ళిద్దరూ అందులోకి చేరిపో యారు.

శాంతమ్మ ఒక్కసారిగా లోపల్నుండీ సుడులు తిరుగుతూ తన్నుకొస్తున్న భావం, కళ్లను అప్పగించి చూసినందుకో, లేక కళ్లు తన అంచనాలను సరిపోల్చలేకపోయినందుకో, లోపల గత కొన్నేళ్లుగా అణుచుకున్న తీవ్రతో, ఆమె కళ్ల వెంట కారిపోతున్న ధార. ఉగ్గబట్టు కున్న దుఃఖం.

చేతిలో ఉన్న కవర్‌ను కళ్ల ముందుకు పెట్టు కొని చూసింది. అక్షరాలు ఎవరి చేతిరాతో ఆమెకు స్పష్టంగా తెలుసు. అంత అందంగా తన పేరును ఎవరు రాస్తారు? పూర్తిగా తన తండ్రి ఇంటి పేరుతో పాటు. వైఫాఫ్‌గా తన భర్త పేరు లేకుండా, ''దొంగ నా కొడుకా ఎంత బాధ పెడు తున్నావురా'' అనుకుంటూ కవర్‌ను పెదవులకు ఆన్చుకుంది. కవర్‌పై రాలుతున్న కన్నీటితో అది తడిస్తే వెంటనే కొంగుతో తుడిచింది. గేటు దాటి వాకిలిల్లోకొస్తూ, లోపలకి పోదామనుకొని ఆగి మెట్ల మీదనే కూలబడిపోయింది.

చేతి వేళ్లతో పాటు కవర్ వణుకుతూ ఉంది. శాంతమ్మ ఆపాదమస్తకం కంపిస్తూ ఉంది. ఒక్క సారిగా దిగ్గున లేచి, మళ్లీ గేటు తెరుచుకొని, వెళ్లిన వ్యక్తులు నిల్చుండిన చెట్టు కిందికి వెళ్లింది. నేలను ఆనవాళ్లు పట్టి పడిన అడుగుల మీదనే నిలబడి గుండెల నిండా శ్వాస పీల్చుకొని 'బిడ్డా' అని గొణుక్కుంది. చల్లని గాలి ఆ తల్లి మీద మెత్తని ఆకుల్ని రాల్చుతూ ఆమెను స్వాంతన పరుస్తూంటే, చింతచెట్టు ఆకుల వర్షంలో నిలబడి ఉత్తరాన్ని అతి జాగ్రత్తగా తెరచి శాంతమ్మ ఆత్రంగా అక్షరాల్ని వెదుక్కుంది.

ప్రారంభ వాక్యం ''అమ్మా...'' తర్వాత కింద సంతకాన్ని చూసి గొప్ప సంతృప్తితో ఉత్తరానికి ముద్దులు పెట్టింది.

ఒక్కసారిగా తననెవరైనా గమనిస్తున్నారా అన్నట్టు చుట్టు పక్కల ఇళ్లనూ, పరిసరాలనూ తేరిపార చూసి, ''అమ్మయ్యా'' అనుకొని ఆ చింత చెట్టు కింద కట్టమీదనే కూచుని తన ఇంటి వైపు చూస్తూ...

ఇలాంటి చెట్టు కిందనే కూర్చునే రాసింటాడా లేక ఇంకెక్కడైనా ఏ కొండ గుట్టల్లో...వేటాడు తున్న భయాల్ని పారదోలుతూనో, అనుకుంటూ ఉత్తరంలోని అక్షరాల వెంట పరుగులు పెట్టింది. ఆమె మనస్సుతో పాటు ఆమె కళ్లు ధారలవుతూ సంగమిస్తుంటే, కొంగుతో అడ్డుకట్టలు చేసు కుంటూ చెట్టు స్వాంతనను భరించలేక ఇంటిలోని కొచ్చింది.

ఆ తర్వాత శాంతమ్మకు కాలం ఎట్లా గడి చిందో, ఆ ఉత్తరాన్ని ఎన్ని సార్లు చదువుకుందో, ఎన్ని జ్ఞాపకాలను తవ్వుకుందో, ఇంకిపోని సరస్సు ఎన్ని అశ్రువుల్ని రాల్చిందో చెప్పడం సాధ్యం కాదు. ఆ తల్లి ఆ సాయంత్రం లోపు ఆ ఉత్తరాన్ని చదువుతూ ఎన్ని ప్రసవ వేదనల్ని అను భవించిందో, ఎంత గర్భశోకాన్ని పొందిందో, కొడుకు పుట్టింది మొదలు ఇల్లు వదిలే దాకా ఎన్నెన్ని జ్ఞాపకాలు గుర్తున్నాయో అన్నింటినీ కల బోసుకొని పురా మనిషిలా గడిపింది. ఎంతో వెనుకబడిన కులం నుండీ, అతి పేదరికం నుండీ ఎంతో కష్టంతో ఎదిగి ఇప్పటికీ స్థితికి చేరుకున్నా మనుకునేంతలో ఆ సంతోషాన్ని మిగల్చకుండా లోక దుఃఖానికి కారణాలు వెదుకుతూ కార్యా ర్థియై వెళ్లిన గౌతముడిలా అడవుల పాలయ్యాడు కదా తన బిడ్డ అని వగచింది.

శాంతమ్మకు కన్పించినట్టే కన్పించి మాయ మైపోయిన కొడుకు రూపం కళ్లముందు కదులు తోంది....


''అమ్మా! నీకు తెలీదా...నీలాంటి ఎందరో తల్లులు ఎన్నో బాధలు పడుతూంటే నీ కంటే హీనాతి హీనంగా బతుకుతూంటే, నువ్వూ నీ ఉద్యోగం పేరుతో పల్లెలు తిరుగుతూ చూస్తుం టావు గదా, వాళ్ల ముందు మనమెంతమ్మా? ప్రమాదాల అంచున ఉంటానని, నా గురించి భయపడతావు గానీ, చూడమ్మా నీ కొడుకు బతికే ఉన్నాడు. ఒకవేళ మరణించినా బతికే ఉంటాడు'' గౌతమ్ మాటల మాయాజాలంతో ప్రేమ పాశాల బంధనాల్లో శాంతమ్మకు ఎదురుగా ఉన్న వీడు నా కొడుకేనా లేక ఏ పురా జ్ఞాపకపు శకలమా అన్పించేలా చేశాడు.

రెండేళ్ల క్రితం, ఒకానొక చలికాలపు రాత్రి రైల్వే స్టేషన్‌లో గౌతమ్‌ను ఆమె ఎంత సేపు చూసిందనీ, ఏం మాట్లాడిందనీ, కలిసిన పది నిమిషాల్లో, నిష్ఠూరాలూ, కోపాలూ, వేడికోళ్లూ, భంగపాట్లూ అన్నింటికీ సమాధానంగా ''అమ్మా...అమ్మా'' అంటూ గౌతమ్ నోటి ముత్యాల మాటను మోయడం తప్ప శాంతమ్మ ఏం చెప్పగలిగిందనీ!

''ఇంతకీ ఏమంటావురా...ఇంటికి ఇకరావా? మీ నాన్నను చూడవా? తమ్ముడు కాబట్టదా..'' అంటే ఇదేనా ఆఖరు ప్రశ్న అన్నట్లు ఎంత పగల బడి నవ్వాడనీ, ''తిక్కమ్మా...మీరందరూ నా కళ్లల్లో ఉంటారు. నా గుండెల్లో ఉంటారు. నేను మీ కోసం ఏం చేయకున్నా మీ కాలం మహా బాగా గడిచే వీలున్నప్పుడు మీ గురించిన చింత నాకెందుకు చెప్పూ...వస్తా తప్పకుండా వొస్తా. నీ బిడ్డను తిరిగి రాకుండా ఉంటానా...అవునమ్మా నేను మాత్రమే నీ బిడ్డనా, ఎంతో మంది బిడ్డలు నీలాంటి తల్లుల కోసం పని చేస్తున్నారో తెలుసా? వాళ్లంతా నా తర్వాత నిన్ను కలవరా, నీ యోగ క్షేమాలు చూడరని అనుకుంటున్నావా..?''

''అంటే నువ్వు రావారా...'' ఆఖరి మాట వినిపించనీయకుండా పెద్ద శబ్దం చేస్తూ రైలు రావడంతో తన చేతిని ముద్దు పెట్టుకొని రైలుతో పాటు చీకటిలో మాయమైన గౌతమ్.

శాంతమ్మకు తన భర్త ప్రభాకర్, ఇంట్లోకొచ్చే దాకా సాయంత్రమయ్యిందనే ధ్యాసే లేదు. నెలల బిడ్డను ఒళ్లో పెట్టుకునే తల్లిలాగా ఆ ఉత్త రాన్ని పట్టుకొని సోఫాలో అలాగే ఉండి



పోయింది.

"గౌతమ్ గౌతమ్" అంటూ ఆమె గుండె నిమిషానికి డెబ్బై రెండు సార్లూ శబ్దిస్తూనే ఉంది.

"ఏం శాంతా, యేందీ వేషం, మళ్లా ఒంట్లో బాగాలేదా..." అంటూ ప్రభాకర్ ఆమె నుదిటి మీదా, గొంతుకిందా చేయి వేసి చూసి, చారికలు కట్టిన చెక్కిళ్లను చూసీ, ఆశ్చర్యంగా

"ఏమైంది...ఎందుకలా యేడ్చావూ..." అంటూ "ఏం మళ్లా, నీ పెద్దకొడుకు గుర్తుకొచ్చాడా..." అంటూ ఆమె పక్కనే సోఫాలో కూర్చోబోతూ, ఆమె ఒళ్లో ఉన్న ఉత్తరాన్ని చూశాడు.

శాంతమ్మ ఉత్తరాన్ని భర్త చేతల్లో పెట్టి ఒక్క పెట్టున ఏడుస్తూ భర్త ఒళ్లో వాలిపోయింది.

ఎగసిపడుతున్న భార్య శరీరాన్ని నిమురుతూ, ఆమె తల మీద చేయి వేసి కొడుకు పట్ల, భార్య పట్లా, ఉన్న ప్రేమ దుఃఖంగా మారుతూ ఉంటే, "ఎందుకే ఎందుకు దుఃఖ పడతావ్ వాడి కోసం. నీకు దూరమైన వాడి కోసం ఎందుకీ తాపత్రయం, మరిచిపో వాణ్ణి" గద్గదస్వరంతో అంటుంటే,

"అట్లానద్దండీ....వాడు నా బిడ్డ...ఎట్లా మరిచి పొమ్మంటారు..."

"ఉన్నాడో పోయాడో తెలీని వాని గురించి ఎందుకే ఈ దుఃఖం...ఈ పొద్దు కాకుంటే రేపైనా చావు వార్త వినే వాడి గురించి ఎందుకే మరి ఈ యాతన"

"కానీయండి....అట్లానే కానీయండి. ఈ రోజుకు ఇంకా ఈ భూమ్మీద ఎక్కడో ఒకచోట ఉన్నాడండీ. ఏదో ఒక మంచి పని చేస్తూ ఉంటాడండి. అందుకు సాక్షమీ ఉత్తరం...."

"ఏది మంచిపనో, ఏది మంచి పని కాదో నిర్ణయిస్తున్నది అధికారమేనే...పోలీసులకు మంచి అనిపిస్తేనే మంచి, కాదంటే చెడు. నీ కొడుకును ఈ లోకం మంచి అంటుందా? అనే పరిస్థితులున్నాయా? లోకం మంచి అనని నీ కొడుకు కోసం ఈ దుఃఖం ఎందుకు, లే పైకి లే" విసుగు, నిస్సహాయత కలగలసిన గొంతుతో ప్రభాకర్...

"రేయింబగళ్లూ ఒకటే ఏడుపు, ఒక సంతోషం లేదు. ఒక సంబరం లేదు. దేశాన్ని ఉద్ధరించడానికి అడవులు పట్టిపోయిన దొంగ నా కొడుకు గురించి, ఏమన్నా అంటే పొగడ్తలు..." ప్రభాకర్‌లో పదేళ్లుగా పేరుకుపోయిన కోపం, కసి, ప్రేమ, దుఃఖం, వైరాగ్యం అన్నీ కలగలసి ఉవ్వెత్తున ఎగిసిపడ్డాయి. భుజానికున్న క్యారియర్ బ్యాగ్‌ను యిసిరి నేలకు కొట్టి, కాళ్లకు ఎదురుగా ఉన్న కుర్చీని ఒక తన్ను తన్ని చేతిలో ఉన్న ఉత్తరాన్ని ఉండమట్టి శాంతమ్మ మీదికి విసిరి బాత్‌రూమ్‌లోకెళ్లి దభీమని తలుపు మూసుకొన్నాడు.

శాంతమ్మకు భర్త ఆగ్రహం, ఆవేశం కొత్తగాదు. అవి ఎంతసేపో ఉండవనీ ఆమెకు తెలుసు. కర్తవ్యం తెలిసిన మనిషిలా ఆమె పైకి లేచి గర్భస్థ శిశువులా ముడుచుకుపోయిన ఉత్తరం ఉండను పదిలంగా సాపు చేసి జాగ్రత్తగా ఎదురుగా టేబుల్ సొరుగులో దాచేసి, సింకు ముందుకెళ్లి అద్దంలో తనను తాను ఇరవై సెకన్లు చూసుకొని, కొలాయిని తిప్పి, ఇరవైసార్లు ముఖం మీదికి చన్నీళ్లు చల్లుకొని, ముఖం తుడుచుకుంటూ వంటింట్లోకి పోయి కాఫీ కలిపింది.

ఐదు నిమిషాల తరువాత ప్రభాకర్ పంచె కట్టుకొని బెడ్‌రూంలో నుండీ బయటికొస్తూనే ఆయన ఎదురుగా కాఫీ కప్పుతో నిలబడింది. ఆయన నెమ్మదిగా భార్య ముఖంలోకి చూసీ, ఆమె చెంపల వెంట వేలాడుతున్న వెంట్రుకల పాయలను చెవుల వెనుక్కు తోసేస్తూ, మరో చేత్తో కాఫీ కప్పు అందుకొని, ముఖాన బొట్టు లేదని గుర్తు చేశాడు.

కాఫీ తాగి పెట్టుకుంటానులెండని, డైనింగ్ టేబుల్మీద ఇద్దరూ ఎదురెదురుగా కూర్చొని నిశ్శబ్దంగా కాఫీ తాగాక, "ఏం కూర చేయమంటారు..." సాధ్యమైనంత నవ్వును పెదవులపై పులుముకుంటూ అడిగింది.

"అఁ...ఏమొద్దు...పొద్దుందే తిందాం గానీ, పైకిరా కాసేపు షటిల్ ఆడదాం...." అన్నాడు.

ప్రభాకర్‌కి స్పష్టంగా తెలుసు. ఉత్తరాలు గాయాలు రేపే ఇట్లాంటి దినాల్లో ఇద్దరి మధ్యా ఘర్షణ రోజుకంటే పెరుగుతుందనీ, దాన్నుంచి భార్య ఆరోగ్యం మరింత దెబ్బతింటుందనీ, ఆమెకున్న షుగర్ తారాస్థాయికెల్తుందనీ, ఒక్కోసారి కోమాలోకి తీసుకెల్తుందనీ, ఈ పదేళ్ల దుఃఖం సాక్షిగా భార్యను మిగుల్చుకోవడం, పెద్దకొడుకు మిగిల్చిన గాయపు సలుపుకంటే ముఖ్యమనీ. అందుకే పెద్దకొడుకు నిర్వాకం గురించి కాకుండా భార్య గురించీ, చిన్న కొడుకు గురించీ ఆలోచిస్తాడాయన.

కొడుకును పిచ్చిగా ప్రేమిస్తూ, తన దారిలో తాను వెళ్లిపోయిన కొడుకును విమర్శించకుండా అక్కున చేర్చుకునే భార్యంటే ఆయనకు ఎనలేని కోపం, అంతే సానుభూతి కూడా.

"ఏం చేస్తుంది పిచ్చిది. వాణ్ణి ప్రాణంగా పెంచింది. ప్రేమించింది" అనుకుంటాడు.

ఇల్లు విడిచి తనదారిలో వెళ్ళిపోయిన కొడుకంటే అతనికీ ప్రేమ లేకపోలేదు. అయితే అతను వెళ్ళిన మార్గం ఎదురుగా నిలబడి విజయాలు సాధిస్తున్న మార్గం కాకపోవడంతోనే ఉక్రోషంగా కఠిన విమర్శగా మారింది.

"ఇంత ప్రేమానురాగాలు పంచిన తల్లిని విడిచి వెళ్లిన కొడుకు వాడొక కొడుకా...వాడు ఎంచుకున్న మార్గం ఒక మార్గమా, ఇంత వెనుకబడిన కులంలో పుట్టినోడు పైకెదిగి పదిమంది సాటి కులస్తులకు సాయం చేస్తే చాలాదా, లోకం ఇంత మారిపోయి తెలివున్న ప్రతివాడూ అంతో, ఇంతో సంపాదించుకుంటా, పేరు తెచ్చుకుంటా వుంటే, ఈ నాకొడుకేందో పనికిమాలిన సిద్ధాంతాల వెంటబడి అడవులకు పోయినాడు" అని శాంతమ్మను ఎత్తి పొడుస్తుంటాడు.

".... చార్ మజుందార్ చెప్పిన కాలానికి ఈ కాలానికి చాలా మార్పులు వచ్చినాయి. ఆయన పంతోమ్మిది వందల డబ్బై అయిదుకే విప్లవం వచ్చేస్తుందని చెప్పినాడంట. ఆ కాలానికి విప్లవం కాదు కదా ఇండియాకు ఎమర్జెన్సీ వచ్చింది... ఉరికే కొడుకును గొప్పవాడు అనుకోవడం కాదె


*With Best Compliments From*



Ph: 27171730

**Mahalaxmi Enterprises**

Plot No.6, Shop No. 3,
IDA Nacharam 'X' Roads,
Hyderabad - 500 076.

Authorised Dealers for:
CASTRAL INDIA LTD., BPCL
Dealing with: IOC, HPC
Dealers in: All Industrial Lubricant Greases & Cotton Waste Etc.

శాంతా... వాన్ని నడిపించిన చార్ మజుందార్ కంటే గొప్పగా తెలిసిన వాళ్ళు చెప్తుండేది చాలా విషయాలున్నాయి. అవన్నీ చదవాలా నువ్వు...'' అంటూ వార్తా కథనాలలోనూ, పుస్తకాలలోనూ ఇతరత్రా వచ్చే చర్చలను తను చదివి శాంతమ్మతో కూడా చదివిస్తుంటాడు ప్రభాకర్, అట్లా చాలా విషయాలు పట్ల అతను తనదైన అవగాహన ఒకటి పెంచుకున్నాడు. తెలుగు సమాజంలో బలంగా వున్న కుల రాజకీయాలను, కమ్యూనిస్టు రాజకీయాలను కలగలిపి ఆలోచిస్తూ కొడుకు వెళ్ళిన మార్గాన్ని బేరీజు వేస్తుంటాడు. అవన్నీ తన బ్యాంకులోనూ భార్యతోనూ, దొరికితే వేదికల మీదా మాటాడేస్తుంటాడు.

ప్రభాకర్ బ్యాంకులో ఫీల్డ్ ఆఫీసర్గా ఉద్యోగం చేస్తూనే తమ కుల సంఘంకు జిల్లా కార్యదర్శి, వాళ్ల కుల సంఘం సభ్యులందరితో ఒక సహకార సంఘం పెట్టించి, పేద సభ్యుల ఆర్థిక అవసరాలు తేర్చే ఏర్పాటు చేయించాడు. ప్రతి యేటా వాళ్ల కులంలో పేద విద్యార్థులకు స్కాలర్ షిప్పులు, కులసంఘం ఆధ్వర్యంలో పంచే కార్యక్రమాలు నిర్వహిస్తూంటాడు. బీసీ సంఘాల రాజకీయాల్ని గుర్తింపు రాజకీయాలంటే ఆయన ఒప్పుకోడు. అదే నిజమైన రాజకీయాలని వాదిస్తాడు. 'కులసంఘాలు పెరిగి పెరిగి అందరికీ అందరి ఆస్తిత్వమూ అర్థమై, అనివార్యమై అందరికీ అందరమనే ప్రజాస్వామిక సూత్రం అలవర్చుతుందేగాని, ఏ కుల సంఘానికి ఆ కుల సంఘం ఘనీభవించదు' అని తన వేదికల మీద ఉపన్యాసాలు ఇస్తూంటాడు.

చిన్నకొడుకు ఆనంద్ బెంగుళూర్ నుండీ ఇంటికొచ్చినప్పుడు డైనింగ్ టేబుల్మీద ఇవే హాట్ హాట్ చర్చలు.

ఆనంద్ వాళ్ల నాన్నను ఖండించి మాట్లాడడానికి ఇష్టపడడు. అట్లా అని వాళ్లమ్మ మనసు ఈ మాటల వల్ల గాయపరచడమూ ఇష్టపడడు. శాంతమ్మ మాత్రం తండ్రీకొడుకుల చర్చను మౌనంగా వింటూ, మనసులో చిన్న కొడుకు వాదనను సమర్థిస్తుంటుంది.

''చూడ్రా ఆనంద్ దండకారణ్యంలో ఉండే గిరిజనులకు ఈ వ్యవస్థ మీద పగపట్టాల్సినంత తీవ్ర కారణమేముంటుంది. వాళ్లందర్నీ కూడగట్టి యుద్ధం చేయించడానికి, ఈ వ్యవస్థలోనే అణగారిపోతున్న దళిత బహుజనుల్లో ఆ పగను రగిలించాననుకుంటే ఇక్కడే పని చేయాలి కదా. అణగారిన వర్గాల్లో వ్యవస్థ మీద పగనూ, అది తీర్చుకోవాలనుకునే పట్టుదలనూ పెంచడానికి ప్రయత్నించే మార్గాలూ పద్ధతులూ వెదక్కుండా, ఊరి నుంచే అడవుల్లోకి కొందర్ని తీసుకోని పోయి ప్రజా సైన్యాన్ని నిర్మిస్తాం అంటే ఎట్లవుతుంది?''

''అవును నాన్నా, మన వ్యవస్థ గిరిజనుల జీవితాల్లోకి చొరబడడం లేదా, వాళ్ల భూముల్ని లాగేసుకుంటున్నారంటా, వాళ్ల ఉత్పత్తుల్ని చౌకకు తెచ్చుకుంటూ, అడవుల్లోని సహజసంపద కోసం వాళ్లను తరిమేస్తున్నారంటా, దండకారణ్యంలోని బొగ్గూ, బాక్సైట్ కోసం గిరిజనుల జీవితాన్ని అల్లకల్లోలం చేసేప్పుడు, వాళ్లు తిరగబడరా?''


''అవును తిరగబడతారే అనుకో, ఎంత వరకూ తిరగబడతారు? ఉన్న సమస్య తీరిపోతే చాలనుకునేంత తిరగబడతారు. అంతే కానీ, ఢిల్లీలో రాజ్యం మారేదాకా మా సమస్యలు తీరవు అనేంత అయితే తిరగబడరు కదా...ఢిల్లీ రాజ్యం మీద గిరిజనులకు సహజసిద్ధమైన పగ ఉండదు కదా. దాన్ని మార్చాలనీ వాంఛ ఉండదు కదా, వీళ్లు బలవంతంగా వాళ్లలోకి జొరబడి వాళ్ల తాత్కాలిక సమస్యల్ని తీర్చే క్రమంలో ఇంకింత హింసను పెంచుతున్నారు. సాల్వాజుడం అయితేనేం సాల్వాజుడంకు వ్యతిరేకంగా వీళ్లు చేస్తున్న హింస అయితేనేం, గిరిజనులు బలి అవుతున్నట్టే లెక్క కదా.....''

''డాడీ నువ్వేమన్నా చెప్పూ, వాళ్లు లేకుంటే మాత్రం...ఈ సిస్టమ్ ఇంతకన్నా వరెస్ట్గా అయితే ఉండేది. కనీసం వాళ్ల యాక్షన్ వల్ల గ్రామీణ ప్రాంతాల్లోనూ, గిరిజన ప్రాంతాల్లోనూ అంతో ఇంతో మార్పులైతే వచ్చాయి'' అంటాడు ఆనంద్.

''నీ మొగం...వాళ్ల యాక్షన్లు ఏవీ రిలవెంట్ కాదు. వీళ్లు గన్ పట్టుకొని అమాయకులతో ప్రాణత్యాగం చేయించుకుంటూ భారీ మూల్యానికి తెస్తున్న మార్పులు ఒక గ్రామీణ విలేఖరి కెమెరాతో, పెన్నుతో తెస్తాడు. ఇప్పుడు మీడియా చూడూ, మారుమూల వార్తను టీవీ స్క్రీన్ చూపిస్తుంది. అన్యాయాలు చేసే నాయాళ్లకు గుండెల్లో దడ పుట్టిస్తోంది. ఈ మాత్రం దానికి వీళ్లు అడవుల్లోకి పోవాల్నేమిరా.. ఒకవేళ అడవుల్లో గిరిజనులకు నాగరికత నేర్పిస్తే నేర్పిస్తారేమో, అక్కడేమన్నా కొన్ని పనులు వెలగబెడతారనే అనుకుందాం, వాటివల్ల మిగతా దేశానికి ఏం ఉపయోగం? ఈ దేశంలో ఎన్ని దేశాలుండాయిరా? ఒక గిరిజన ప్రాంతాన్ని బాగుపరిస్తే ఆ బాగు పరచడానికి వేలాది మంది బలి ఇచ్చుకుంటాపోతే, మిగతా వాటి సంగతేమిటి? ఎప్పటికి తెల్లారల్లా, మీ అమ్మలాంటి వాళ్లు ఎంత మంది కన్నీళ్లు కార్చల్లా....''

''అమ్మ ఇప్పుడు కన్నీరు కారుస్తోందని నువ్వు ఉద్యామాలు ఆగిపోవాలంటావు. అయితే ఎంతో మంది తల్లుల కన్నీళ్లు చూసే వాళ్లు ఉద్యమకారులైనారేమో, అది కూడా మనం గమనించాలి కదా...ఈ వ్యవస్థ ఎంత అన్యాయంగా ఉంటే ఎంత దుర్మార్గంగా ఉంటే కొందరట్లాంటి నిర్ణయం తీసుకోని అడవుల్లోకి వెళ్లిపోతారో ఆలోచించాలి గదా....''

''అదే నేను చెప్పేది కూడా ఇక్కడ ఈ వ్యవస్థలో ఉన్నవాడికీ, ఇది చేస్తున్న అన్యాయాలకు బలి అవుతున్న వాడికీ ఈ వ్యవస్థ మీద ఉన్నంత పగ, దండకారణ్యంలో గిరిజనుడికి ఉండనప్పుడు, నీ మొత్తం ప్రయత్నం ఇక్కడ ఉండాలి కదా....ఇక్కడ అణగారిన ప్రజల్లో పని చేయాలి కదా..వీళ్లల్లో చైతన్యాన్ని పెంచాలి కదా....బహిరంగంగా వాళ్లను తీర్చిదిద్దే పనులు కుప్పలు కుప్పలు పెట్టుకోని చిన్న గుంపు రహస్యంగా ఆయుధం పట్టుకుంటే ఏం లాభం? ఢిల్లీ రాజ్యం పట్టుకున్న పెద్ద ఆయుధం ముందు నీవెంత? ఒక హేతువాద సంఘం లేదు, ఒక వ్యవసాయం కమ్యూన్ లేదు. ఒక ప్రత్యామ్నాయమైన స్కూల్ లేదు. కనీసం కమ్యూనిస్టు నడిపే ఒక సహకార



సంఘం లేదు. మైదానాల్లో ఇవన్నీ ఏమీ చేయకుండా ఇలాంటి వాటిని కుప్పలు కుప్పలుగా పెంచే పని చేయకుండా, వేరే పని అదే ముఖ్యమైందని చేస్తూ వేలాది మంది బలి ఇస్తుంటే, ఏమనాల్రా వాళ్లను. వెనుకబాటు సిద్ధాంతం, వెనుకబాటు ఆచరణా కాదా...కనీసం మీ అమ్మ వెలుగు ఆఫీసులో పనిచేస్తుంది కదా....పదేళ్లుగా మహిళా సాధికారిత పేరుతో ఎన్నో మార్పులొచ్చాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఏ విప్లవమూ పని చేయకుండానే బీసీల్లో, ఎస్సీల్లో ఎంతమంది గ్రామస్థాయి లీడర్లుగా, పొదుపు మహిళలుగా ఎదగట్లేదూ...ఇవన్నీ గమనిస్తూ వీళ్లను మరింతగా ఎదగడానికి ఆసరా ఇవ్వకుండా, ఎక్కడో పని చేస్తామంటే దాన్నేమనాల మరి...''

''వాళ్లను అంటున్నారు సరే, మీ సంగతేమిటి మరి? మీరు బీసీ ఉద్యమాలు చేస్తున్నవాళ్లు కులానికో సంఘం పెట్టుకొని కులం శాఖకొక సంఘం పెట్టుకొని చీలికలు పేలికలై మొదట మేము బాగుపడాలంటే మేము బాగుపడాలని పోటీలు పడి కలవలేకపోతున్నారే. మరి మీరంతా ఎప్పుడు కలిసి మీరంటున్నటువంటి బీసీ రాజ్యాధికారాన్ని ఎప్పుడు సాధిస్తారు?''

''ఆకలితో ఉన్నవాడు ఎదురుగా రొట్టె ముక్క కనపడితే మొదట నాకే కావాలనుకొని పరుగులు పెట్టడంలో అన్యాయం ఏమీ లేదురా ఆనందూ, పరిగెత్తి పరిగెత్తి వాళ్లే తెలుసుకుంటారు. ఇట్లా కాదు, ఇట్లయితే మనలో ఎవరికి రొట్టె దొరకదు అందరూ కలిసి పనిచేస్తేనే అందుతుందని జీవిత అనుభవం నుంచి తెలుసుకుంటారు. అప్పుడు ఇట్లా అందరికి కలిపేదానికైనా ప్రయత్నించేవాళ్లు ఉండాలి కదా, అట్లాంటి వాళ్లందరూ అడవిలోకి వెళ్లి అంతమయిపోవడాన్ని ఏమనాలా?''

''నాకవన్నీ తెలీదు గానీ...నువ్వేమన్నా అనుకో, మనం చేయలేని దాన్ని వాళ్లు చేస్తుంటే... వాళ్లు నాకు హీరోలుగా కన్పిస్తారు డాడీ. మనమెట్లాగూ ఆ ఛాయలకున్నాడా పోము. చేసే వాళ్లనయినా చేయనీయండి...''

''ఆనందూ, రేయ్ ఆనందూ నీకేం తెలుసురా...బ్యాంగ్లూర్‌లో ఇంజనీర్‌వై సినిమాల్లో హీరోలని చూసినట్టు చూస్తున్నావు, వాళ్లను ఎంజాయ్ చేస్తున్నావు. నువ్వేకాదురా, చాలా మంది వాళ్లని అట్లే చూస్తున్నారు. ఇట్లా చూసే వాళ్లందరికీ ఒక కొడుకుండీ, కళ్ల ముందు ఉండాల్సిన చెట్టంత కొడుకు అడవుల్లో మాసైపోతే, ఫ్యాన్లకింద కూర్చుని ఉపన్యాసాలిచ్చే నా కొడుకులు చెప్పే త్యాగాల మాయలో పడి దారి తప్పిపోతే అప్పుడు తెలుస్తుందిరా ఆ బాధ. ఎంత ప్రేమగా పెంచుకున్నామో తెల్సారా మీ అన్నను....''

గొంతులోకి దుఃఖం అడ్డుపడుతూంటే అన్నం మింగలేక, దుఃఖాన్ని కక్కలేక, ప్లేట్లో చేయి కడిగేసి, చివ్వున లేచి బెడ్‌రూమ్‌లోకి పోయి మంచం మీద వాలిపోయే ప్రభాకర్ ద్వేషం ఉద్యమం మీద కాదనీ, అది పుత్రశోకమనీ, అతని చిన్నకొడుకు ఆనంద్‌కు అర్థమవుతూ ఉంటుంది. అలాంటి క్షణాల్లోనే భర్త దుఃఖాన్నీ, చిన్న కొడుకు ధైన్యాన్నీ కళ్లారా చూస్తే శాంతమ్మకు 'అవును నిజమే పెద్దోడు చేసింది అంత కరెక్ట్ కాద'నిపిస్తూ ఉంటుంది. ఎక్కడో దాక్కొని చేసేదేముంటుంది? ప్రజలకవసరమయ్యే పనులే అయితే చాలా మంది ప్రజలు అందులో పాల్గొనాలి కదా?ఏదీ ఎంత వెదుకుదామన్నా అట్లా కనిపించదే? బలవంతుల ముందు కట్టెపుల్లలు పట్టుకొని ధర్మాగ్రహమే అయితే మాత్రం చూపిస్తే దాన్నే ప్రదర్శిస్తే దాన్నుంచీ ఏమొస్తుంది.....ఏం వొరుగుతుంది...వేలాది విలువైన ప్రాణాలు పోవడం తప్ప. ఇట్లాంటి అంతులేని ప్రశ్నల సారంగాలలో పడి ఎటూ తేలక, ఊపిరాడక షుగరూ, బీపీ పెంచుకొని, కోమాలోకి వెళ్లిపోతుంటుంది శాంతమ్మ.

అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ''శాంతా, శాంతా...'' అంటూ ప్రభాకర్ ఆర్తనాదాలకీ, ''అమ్మా'' అంటూ చేసే ఆనంద్ అరుపులకీ సాక్ష్యంగా ఆ ఇంట్లో పదేళ్లుగా నిరంతరం దుఃఖపు తెర కదలాడుతూ ఉంటుంది.

''ఇక చాలండీ కాక్ కన్పించడం లేదు..... స్నానం చేద్దాం రండి, చారుకు పెట్టేస్తాను....వేడి వేడిగా అన్నం తిందాం...''

ఆట ముగించి చీకటి ముసురుకుంటున్న వేళ మెట్లు దిగుతున్న శాంతమ్మ ఒక్కో మెట్టుకు ఒక్కో ఆలోచన చేస్తోంది... ఆ మాట భర్తతో ఎట్లా చెప్పాలా అని..

ఇలా ఎన్నిసార్లో....ప్రతీసారీ భర్త ఏమన్నా అంటాడేమోననే భయమూ, వెల్లక తప్పని పరిస్థితి కలిగే ఒత్తిడీ....

అయితే ప్రతీ సారీ తను అనుకున్నట్టే వెల్తానే ఉంది. భర్త చూసి చూడనట్టు ఉంటూనే ఉన్నాడు. ప్రతీ సారి కొత్త భయం,కొత్త అనుభవం. ఏదైనా పొరపాటుజరిగితే జరిగే నష్టం? ఆ టెన్షన్ తలుచుకుటే శాంతమ్మ ప్రాణం బిగుసుకుపోతూ ఉంటుంది.

చేతిలో పుస్తకమో, వస్తువో పట్టుకొని ఎదురు చూడ్డం, మాట్లాడిస్తే చెప్పాల్సిన మాటే చెప్పి, తను వాళ్లు కలవాల్సిన మనిషేనని గుర్తింపచేయడం, ఇవన్నీ తన కొడుకు కోసమేనా



## సినిమాల్లోకి తిరిగి రాధ?

**కూ**తురు కార్తీకను టాప్ హీరోయిన్‌గా చూసుకోవాలని కలలు కన్న అలనాటి అందాల హీరోయిన్ రాధ కలలు కల్లలుగానే మిగిలేటట్టుందని పలువురు అంటున్నారు. 'జోష్' మీద కార్తీక కన్నా రాధే ఎక్కువ ఆశలు పెట్టుకుంది. ఆ సినిమా రాధని నిరాశపరిచిందని అంటున్నారు. ఇప్పుడు కూతురితో పాటు తాను నటిస్తే ఎలా ఉంటుందన్న ఆలోచనలో రాధ ఉందని ఆమె సన్నిహితులు అంటున్నారు. ఒళ్లు తగ్గించుకొని స్లిమ్ అయితే ఆమెకు అవకాశాలు ఇస్తామని కొందరు చెప్పినట్టు తెలుస్తోంది. అయితే రాధకు అవకాశాలు ఇస్తానన్నది ఎవరు? అన్నది మాత్రం వారు టాప్ సీక్రెట్‌గా ఉంచుతున్నారు. ఏది ఏమైనా రాధ తిరిగి సినిమాల్లో నటించే అవకాశాలు దగ్గరలోనే ఉన్నాయన్నది మాత్రం నిజం!

చేస్తుంది, అనుకుంటూ ఆశ్చర్యపడుతూ ఉండడం పదేళ్లుగా ఆమెకు అలవాటైపోయింది. ఇలా తాను ఎప్పుడో ఒకసారి మాత్రమేచేయాల్సి వస్తే వాళ్లు నిరంతరం ఇట్లా భయోద్విగ్న క్షణాల్లో కత్తుల కొనల మీద తిరగాల్సి వస్తుందే అని వ్యధ పడుతుంది. కొడుకు కనిపించినప్పుడు చెంప పగలగొట్టాలనుకుంటుంది.

''దొంగ నా కొడకా, పదరా ఇంటికి, ఈదారే దొరికిందా? బయట పనిచేయడానికి ఎన్ని పనులు లేవు? ఏంఉద్ధరిస్తావో ఉద్ధరిద్దువుగాని రారా...'' అని అడగాలనిపిస్తుంది.

తీరా ఆ బిడ్డల్ని కళ్లారా ఆ ఉద్వేగ క్షణాల్లో చూసినప్పుడూ, పలకరించినప్పుడూ వాళ్లు మామూలు మనుషులు కారనీ, వాళ్లు చేసేది వాళ్ల కోసం కాదనీ, ఆ పలకరింపుల్లోని ఆర్తి ఒక్క తన లాంటి తల్లి కోసమేకాదనీ, తెలిసినప్పుడూ....ఆ క్షణాల్లో ఆ బిడ్డలు బతికి బయటపడి ఏ ప్రమాదమూ లేకుండా వెళ్లిపోతే చాలని, అంత వరకూ పేర్చుకున్న ఆరోపణలన్నీ మరిచిపోతుంది.

ప్రతీక్షణం ప్రేమతో, ఒక ప్రశంశతో శాంతమ్మా, ఆరోపణలతో, బాధాతప్త విమర్శలతో ప్రభాకర్ అలాంటి వళ్ల గరించి బహిరంగంగానూ, అంతరంగంలోనూ మమేమకమై నడియాడుతూంటే అ ఇంటి వాతావరణం మొత్తం ఒక కల్లోలం, ఒక అలజడి, ఒక పురా ఘర్షణ ఒక నూతన మానవ ఆకాంక్ష పై జరిగే పెనుగులాటతో నిండి ఉంటుంది.

అన్నం తిన్నాకా, ఆపిల్‌కోస్తూ,

'' ఏమండీ రాత్రికి స్టేషన్కొస్తారా...'' చాలా నెమ్మదిగా అడిగింది శాంతమ్మ.

''నేనా! రాను...నేను రాననీ తెలిసీ పిలుస్తావు, ఇన్నిసార్లూ నేను వెల్లమంటేనే పోయొచ్చావా..అయినా ఏమే నీకు బుద్ధుందా... ఎంత నిఘా ఉందో? ఎంత ప్రాబ్లమ్ అవుతుందో..ఎట్ల చెప్పి అర్థం చేయించాల్నేనీకు...జరగకూడంది జరిగితే, ఎంత నష్టమో...తెల్సానే...మన ఉద్యోగాలు పోతాయే....''

''సరే, మీరు రాకుంటే పోనీయండి...ఈ ఒక్కసారికి నే పోయొస్తా...''

''నువ్వు తక్కువ దానివి కాదమ్మా...శాంతమ్మా....ఎట్లా పోతున్నావు మూటా ముల్యా సర్దుకో వాళ్లలోకే కలిసిపో. నూతన ప్రజాస్వామిక విప్లవం చేద్దువు'' ప్రభాకర్ చివ్వున లేచి బెడ్రూం లోకి పోయి దబ్బున తలుపువేసాడు. ఆ ఫోర్సుకు తలుపు రెండు మూడు సార్లు కొట్టుకొని తర్వాత నిశ్శబ్దమై పోయింది. శాంతమ్మ చుట్టూ పరుచుకొన్న వెలుగులో...కూడా ఎన్నో సంశయాలూ... సమాధానాలూ, అవమానాలూ, ఓదార్పులూ, అడ్డుకట్లూ, బార్లా తెరుచుకున్న శ్రీశైలం డ్యాం క్రష్ గేట్ల నుంచి హోరుమని దూకే నీటి వొరవడిలా, ఆలోచనలు...

***

సుడిలో గల్లంతయ్యే అస్తిత్వంలా...ఏమైనా జరగచ్చు అనే భయం సందేహాల వొత్తిడి మధ్యా మధ్యాహ్నం చింత చెట్టు కింద కనిపించిన బ్లూజీన్ అబ్బాయి రగిలిస్తున్న ఆశ, గౌతం గురించి, ఏమైనా తెలుస్తుందనే నమ్మకమూ రైల్వే స్టేషన్లో ఎదురు చూసేలా చేసింది శాంతమ్మను.

చలిగాలి వీస్తోంది.

శాంతమ్మ కప్పుకున్న శాలువాను మరింత బిగదీసుకుంది.

బ్లూజీన్ అబ్బాయి, బుష్‌కోటూ మంకీ కాప్ తలకు పెట్టుకొని ఎదురుగా నిలబడి ''అమ్మా'' అని, తలకున్న మంకీ క్యాప్‌ను తీసేశాడు.

అతన్ని చూసి, ఒక్కసారిగా శాంతమ్మ ముఖంలో వెయ్యి దీపాల వెలుగు పరుచుకుంది. అప్పటికి చిన్నగా తుంపర రాలుతోంది. రైల్వే స్టేషన్ లైట్ల వెలుగులో పట్టాల మీద రాలుతున్న వాన తుంపర పూలు రాలినట్టుగా ఉంది.

శాంతమ్మ మనసు భయమూ, ఆందోళనా, ఆనందమూ ఇంకా ఎన్నో చెప్పలేని భావాల సంగమమైంది. ఏమీ జరగకూడదనీ, బ్లూజీన్ అబ్బాయి క్షేమంగా ఈ స్టేషన్ దాటి పోవాలనీ కోరుకుంటున్నది.

నాలుగు వాక్యాల్లో అతను గౌతం గురించి శాంతమ్మకు చెప్పాడు. దాని సారాంశము గౌతం క్షేమంగా ఉన్నాడనీ, వీలు చూసుకొని అమ్మను కలుస్తాడనీ.

ఆ తర్వాత వాళ్ల మధ్య మహా మౌనం పరుచుకుంది.

శాంతమ్మకు తన ఎదురుగా నడిచిపోతున్న మనుషులూ, ఆ పరిసరాలూ, స్టేషన్లోంచీ వినబడుతున్న శబ్దాలు అంతా ఏదో స్లోమోషన్ పిక్చర్‌లా ఉంది. ఆమెకు తన కొడుకును గురించి ఎంతో అడగాలనుంది. అంతకు మించి వాళ్ల మీద తన ఫిర్యాదుల మూట విప్పాలని ఉంది.


బ్లూజీన్ అబ్బాయి రైలుపట్టాల చీకటిలోకి, అమ్మ మొహంలోకీ చూపుల్ని పదే పదే విసురుతున్నాడు. శాంతమ్మ పదే పదే దిక్కులు చూస్తూ ఉంది.

''ఇంత బలాదూర్‌గా తిరగడమేనా మీ పార్టీ మీకు నేర్పించేది...'' ఆమె ప్రారంభించింది.

ఆ తర్వాత వాళ్లిద్దరి మధ్యా అనంతమైన సంభాషణ ఒకటి, మానవ దుఃఖానికి కారణాలు వెదికే అన్వేషణగా మారింది.

''బలాదూర్‌గా అంటే గాలికి తిరగడం కాదమ్మా. చంపుతావా చంపుతావా చంపు, అంత కంటే ఏం చేస్తావ్ నువ్వు, అన్నంతగా ఉండడాన్ని నేర్పిస్తుంది. అదే గదమ్మా చైతన్యమంటే.''

''చావును ఎదిరించాలని ఉత్త పుణ్యానికి చావడమా నాయనా చైతన్యమంటే, ఇప్పుడు కాలం మారింది. నువ్వు చస్తే నీ చావును చూసి నిలబడి ఆలోచించే స్థితిలో జనాలు లేరు. చాలా రకాల చావులు చూసి ఊర్లో వాళ్లు మొద్దుబారిపోయినారు. రైతులు, చేనేత కార్మికులూ చస్తాంటే, తినింది అరక్క చేసే పనులు చానా ఉంటే వీళ్లేంది ఈ దారిలో బోయి చస్తాండారు అనుకుంటున్నారు. ఏ చావైనా పది మందిలో ఆలోచన కల్గించేదైతే బాగుంటుంది. ఇప్పుడు పరిస్థితులు అట్లా లేవు. ఇప్పుడు మనుషుల సున్నితత్వం మరిచిపోతున్నారు. అది నేర్పించినా పెద్ద విప్లవం చేసినట్లే నాయనా...అయినా తల్లి కొడుకు చావును సహిస్తుందా? పది కాలాలు బతకాలనుకుంటుంది గానీ, అయినా మీరెంత అన్యా



యంగా చస్తున్నారో మీకు తెలుసునా నాయనా, దోపిడీ దొంగలను చంపినట్లు చంపి పడేసి మీ చావు వార్తలో మీరు చేసిండే దాడులూ, హత్యలూ, ఎన్నెన్ని కేసులో చూపి, చంపదగిన వాడని జనాన్ని నమ్మిస్తాండారు గదా, అట్లాంటి మరణం ఒక తల్లి కోరుకుంటుందా చెప్పు....''

''అదంతా కుట్రవమ్మా....మీడియా చేసే కుట్రలూ అట్లాగే ఏకపక్షంగా ఉంటాయి....''

''మీ పక్షం నుంచీ అయినా మీరు చేస్తుండే పనులు జనాలకి తెలియాలి కదా, మీ రాజ్యమొస్తే ఎల్లాంటి పనులు చేస్తారో జనాలకి ఏం తెలుసు? అట్లాంటివి తెలీకుంటే మీ వెంబడి ఎవరొస్తారు చెప్పూ?''

''మా వెంబడి ఎంతో మంది జనాలున్నారు.. మేమూ జనాల్లోనే ఉన్నాము. అడవుల్లో ఉంటామనేది ఒక సంకేతం మాత్రమే....''

''మొన్న మొన్నదాకా నేపాల్ దాకా ఉండా మంత్రి...నేపాలోల్లు మీ . ఊసే ఎత్తడం లేదు ఇప్పుడు....''

''మందిలో కలిసిపొయ్యేటోల్లతో మాకేం పనెమ్మా. కొట్లాడాల్సిన మందితో సర్దుబాటు చేసుకునే వాళ్ల గురించి మనకెందుకమ్మా....ఇంత కాలం కొట్లాడి సాధించుకున్నది ఇంగేమి మిగులుతుంది?''

''కొట్లాడి సాధించుకునింది, కాపాడుకునేకి రాజీ పడ్డారేమో.....మీలాగా వాళ్లు నేల విడిచి సాము చేయకూడదనుకున్నారేమో....''

''మేము నేల విడిచి కలలు కనిందెప్పుడూ లేదమ్మా, మా లక్ష్యమే నేల కోసం. అందరికీ ఇంత భూమి పంచి ప్రజల శక్తి పెంచడం కోసం...''

''రైతులు భూమి మీద పెట్టుబడి పెట్టలేక భూమి నుంచి పరిగెత్తి ఎట్లా వొదిలించుకోవాలనీ చస్తూంటే, మీరు భూమి పంచి ఏం ప్రయోజనం నాయనా...భూమి ఇస్తావు, దాని మీద పెట్టుబడి ఎట్లా పెడతారు? మీరింకా భూముల మీదనే ఉండారు గానీ, ఫ్యాక్టరీల్నీ ఎప్పుడు పట్టుకోవాలా, కార్మికులూ, మాలాంటి ఉద్యోగులూ ఎన్నడు మీ వెంబడి రావాలా....?''

''భూమి ఎప్పుడూ తన విలువను కొల్పోదమ్మా....ఇప్పుడు సెజ్‌ల పేరుతో భూమికి ఎంత విలువుందో తెలుస్తూనే ఉంది గదా...రైతులు భూముల్ని వదిలించుకోవాలనుకోవడం లేదు.... భూమి ఆదాయవనరుగా నిలబడ్డం లేదని నిరాశ పడుతున్నారంతే....''

''మరి అట్లా అయితే వాళ్ల కోసం మీరేమి చేస్తున్నారు చెప్పు? పోనీ ఏమి చేయాలనుకుంటున్నారు? మీరేం పనులు చేస్తారో ఎవరికీ తెలీదు. తెలిసింది మీరు శత్రువులుగా అనుకున్న వాళ్లను చంపడం ఒక్కటే. మా ఆయన కూడా మిమ్మల్ని ఏమేమో విమర్శిస్తుంటాడు, అవన్నీ మీరు వింటే, ఏముందీ అదంతా మధ్య తరగతి వాళ్లు చేసే విమర్శలని కొట్టి పడేస్తారు. ఒక రకంగా అదీ నిజమే, అయినా గ్రామాల్లో ఒక పేద రైతు జీవితానుభవం నుండీ కూడా మీ మీద ఇట్లాంటి విమర్శలే చేయొచ్చు. మీరు భూములు పంచితే పెట్టుబడి ఎట్లా వస్తుంది? విత్తనాలు, ఎరువులు, మార్కెట్లు వీటి గురించి ఏ కొత్త ఉపాయాలు లేకుండా రైతుకు గిట్టుబాటు ఎట్లా వస్తుంది? నువ్వేమన్నా చెప్పు మీ ఆలోచనలన్నీ మార్చుకోకుంటే లాభం లేదు. చూడు నాయనా, మీరు గ్రామాల మీద కన్ను పెట్టినాం అనుకుంటారు గానీ, అక్కడ కూడా మీరు స్పష్టంగా లేరు. ఇంకా పట్టణాలూ, ఫ్యాక్టరీలు జయించకుండా మీరేమీ చేయలేరు. గ్రామాల్లో కింద వాళ్లకు పట్టణాలు ఆదర్శం. దేశం అంతా నగరాల్లోనే ఉంది. నగరాలు దేశాన్ని నడిపిస్తా ఉండాయి. పట్టణాల్లో ఉండే జీవితమే యావద్దేశంలోని మిగతా యువకులకు ఆదర్శం. చదువుకుంటున్న పిల్ల నాయాళ్లను చూడు, జీన్ ఫ్యాంట్లూ, వెనకల వేలాడే బ్యాగులూ, చేతిలో సెల్లూ, ఇంకో చేతిలో కూల్ డ్రింక్ సీసా ఒకర్ని చూసి ఒకరు అనుకరించడం, సినిమాలు, క్రికెట్ ఆటలూ మధ్యలో వచ్చే అడ్వర్టయిజ్‌మెంట్లూ ఇదే జీవితం అయిపోయింది. దీన్నుంచి బయటకి రానంత కాలం వాళ్ల ముందు మీరెన్ని ఆత్మత్యాగాలు చేసినా వాళ్ల కళ్లలో కూడా మీరు పడరు. ఎన్నేండ్లు అజ్ఞాతవాసం చేసినా, మీ బలగాల్ని కూడగట్టుకోలేరు...''

''అమ్మా ఇదంతా నిజమే....వీటి గురించి తప్పకుండా ఆలోచించాల్సిదే.....మార్పును మేము ఎప్పుడూ కోరుకుంటాం. మేమూ మారుతున్నాం. మా పద్ధతుల్ని మార్చుకోవడానికి సిద్ధంగున్నం. మాదొక పెద్ద యంత్రాంగం, మంత్రాంగం. ఒక భాగం ఇక్కడుంటే ఇంకొక భాగం ఇంకెక్కడో ఉంటుంది. ఒక భాగంలో కదలిక ఇంకొక భాగంలో కనిపించడానికి ఆలస్యమవుతుంది. ఒక్కోసారి ఆ మార్పు కనిపించకుండాను పోతుంది. దాంతో చాలా మంది అపార్థం చేసుకుంటున్నారు. మీరు చెప్పినవన్నీ మా వాళ్లకు చెప్తాను...''

ఇక అతను మాట్లాడ్డానికి వీలు లేకుండా పట్టాల మీదకు రైలు కూత వేసుకుంటూ వచ్చేసింది. ఇంకో ట్రైన్ అటు వైపు నుంచీ వస్తున్నట్లు అనౌన్సుమెంటు వినిపిస్తోంది.

శాంతమ్మకు ఇంకా ఎంతో చెప్పాలనుంది. ఇంకాస్సేపు తన కొడుకును బ్లూజీన్ అబ్బాయిలో చూసుకోవాలనుకుంది. అతను ఎక్కాల్సిన రైలొచ్చేసింది కాబట్టి అతను ఎక్కక తప్పదు. తను వీడ్కోలు తీసుకోక తప్పదు.

''నాయనా జాగ్రత్త...నా కొడుకును చూడాలనుందని చెప్పు....ఇంకా, మీరు గన్నులకు పని తగ్గించి మనుషుల్ని కూడగట్టేపని ఎక్కువ చేయండి...ఇంతకు మించి ఇంకేమి చెప్పగలను. మళ్లీ నిన్ను చూస్తానో లేదో తెలీదు. నా బిడ్డలాంటోడివి.....''

శాంతమ్మ మాటలు పూర్తి కాకుండానే అతను టాటా చెప్తూ చిరునవ్వు నవ్వుతూ కదిలిపోయాడు.

దుఃఖమో, ఆనందమో తెలియని ఏదో సంతృప్తితో శాంతమ్మ గుండెల నిండా గాలి పీల్చుకుంటూ స్టేషన్ బయటికొస్తూంటే...ఎదురుగా ఆమె భర్త ప్రభాకర్ నిలబడి ఉన్నాడు.

చీకటీ, వెలుతురు కలగలసిన వేకువ ఒకటి ఎదురుగా కనిపిస్తుంటే భర్తతో పాటు ఆమె నడిచిపోయింది.

★

జి. వెంకటకృష్ణ
9866559584

